సాక్షి నంద్యాల

శనివారం । 13 । జూలై । 2024



అద్భుతం.. అపురూపం

మహానందిలో శిల్పసంపదను చూసిన భక్తులు మంత్ర ముగ్ధులవుతున్నారు. ప్రతి శిల్పం జీవకళతో ఉట్టిపడుతూ శిల్పుల పనితనానికి అద్దం పడుతోంది.

8లో▸



వైభవం తిరుచ్చి మహోత్సవం

బేతంచెర్ల: మద్దిలేటయ్య ఆలయంలో శుక్రవారం రాత్రి తిరుచ్చి మహోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో స్వామి వారిని ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,606
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 31
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 21,643
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 205

న్యూస్‌రీల్

కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

గోస్పాడు: కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు అందజేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో శుక్రవారం కౌలు రైతు గుర్తింపు కార్డులపై జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతు చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. యజమానుల భూ హక్కులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలపై మాత్రమే కౌలుదారుడికి హక్కు ఉండేలా ఈ చట్టాన్ని రూపొందించారని వివరించారు. ఈ కార్డు ద్వారా కౌలు రైతులకు పంట నమోదు చేస్తారని చెప్పారు. ప్రభుత్వం కల్పించే పంటల బీమా, పంట నష్టపరిహారం, పంట కొనుగోలు తదితర ప్రయోజనాలు వర్తిస్తాయని చెప్పారు. ఒకే కుటుంబంలోని కుటుంబ సభ్యుల మధ్య కౌలు కార్డు వర్తించబడవన్నారు. ప్రస్తుతం అందజేసే సీసీఆర్‌సీ కార్డులు 11 నెలల కాల పరిమితికి అందజేస్తున్నట్లు తెలిపారు. వీటి కోసం రైతు సేవా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌ఓలను సంప్రదించి కార్డులను పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ భార్గవి, ఏఓ స్వప్నికారెడ్డి, సర్పంచ్ గడ్డం రత్నమ్మ, గంగుల వెంకటరెడ్డి,వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



నంద్యాల: జిల్లా కలెక్టర్ రాజకుమారిని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి శుక్రవారం ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, శ్రీశైలం దేవస్థానం ఈఓ పెద్దిరాజు వేర్వేరుగా కలెక్టర్‌ను కలిశారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ కోచింగ్

కర్నూలు(అర్బన్):నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ (స్కూల్ అసిస్టెంట్) పోస్టులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి. వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన బీఎడ్, ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులు అర్హులన్నారు. ఈ నెల 18వ తేదీలోగా నేరుగా దరఖాస్తులను అందించాలన్నారు. అభ్యర్థుల ఎంపిక బీఎడ్ మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు 60 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు అర్హులైన అభ్యర్థులకు స్టైఫండ్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు కార్యాలయ ఫోన్ నంబర్ 08518-236076లో సంప్రదించాలన్నారు.

ఆశలన్నీ ఎర్ర బంగారమై..

- జిల్లాలో 31 వేల ఎకరాల్లో మిరప పంట సాగు లక్ష్యం
- లక్ష్యానికి మించి సాగవుతుందని అధికారుల అంచనా
- ఎకరా కౌలు ధర రూ. 50 వేలు పలుకుతున్న వైనం



కోవెలకుంట్ల సమీపంలో సాగు చేసిన మిరప పైరు

కోవెలకుంట్ల: మిరప ఎంత ఘాటు ఉంటుందో ఆ పంట సాగుకు అయ్యే ఖర్చు కూడా అంతే ఉంటుంది. అయినా రైతులు మిర్చిని పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో మిరప సాగుతో నష్టపోయిన రైతన్న ఈ ఏడాది తిరిగి అదే పంట సాగు చేసి ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు సమాయత్తమవుతున్నాడు. మిరప సాగుకు వాతావరణం అనుకూలిస్తుండటంతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. నంద్యాల జిల్లాలో ఖరీఫ్‌లో 31 వేల ఎకరాల్లో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా.. గత నెలాఖరు నుంచి వర్షాలు అనుకూలంగా మారడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే ఆస్కారం ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. సూపర్-10, తేజ, డబ్బీ బ్యాడీ రకాలను సాగు చేస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా సాగుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 7,141 హెక్టార్లలో మిరప సాగు సాధారణ విస్తీర్ణం కాగా 14,467 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 2,349 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా ఆయా మండలాల్లో 7,540 హెక్టార్లలో పంట వేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్షకు పైగా వెచ్చించారు. పంట నెల రోజుల దశ నుంచి వర్షాలు కురవకపోవడం, సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో దిగుబడులు తగ్గిపోయాయి. పదిరోజులకొకసారి ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు నీటి విడుదల చేయడంతో రైతులు గట్టెక్కారు. ఎకరాకు 20 క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో క్వింటా ఎండు మిర్చి సుమారు రూ. 24 వేలు ధర పలకడంతో దిగుబడులు తగ్గినా గిట్టుబాటు ధరతో బయటపడ్డారు.

రెట్టింపు విస్తీర్ణంలో సాగుకు అవకాశం!

ఈ ఏడాది మిరప సాగుకు వాతావరణం అనుకూలంగా మారడంతో జిల్లాలో మిరప సాగు భారీగా పెరగనుంది. సాధారణ విస్తీర్ణం 31 వేల ఎకరాలు కాగా ఈ ఏడాది దాదాపు 60 వేల ఎకరాలకు పైగా సాగయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. మిరప సాగుకు పొలాలను కౌలుకు తీసుకునేందుకు రైతులు పోటీ పడుతుండటంతో కౌలు ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం మిరప సాగు చేసే పొలం ఎకరాకు రూ. 50 వేల వరకు ధర పలుకుతుండటం విశేషం. ఆయా మండలాల పరిధిలో ఒక్కో రైతు 2 ఎకరాల నుంచి 10 ఎకరాల వరకు మిరప సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మిరప నాట్లు కూడా వేస్తున్నారు.



పేరుసోమల సమీపంలో మిరప నారుమడి

జిల్లాలో మిరప సాగు వివరాలు..

నియోజకవర్గం	సాగు లక్ష్యం (ఎకరాల్లో)
బనగానపల్లె	11,975
నందికొట్కూరు	4,655
నంద్యాల	4,227
ఆళ్లగడ్డ	3,443
శ్రీశైలం	1,810
డోన్	403
పాణ్యం (పాణ్యం,గడివేముల)	4,142

మిర్చి యార్డుతో తొలగిన కష్టాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల మార్కెట్ యార్డులో మిర్చి యార్డును ప్రారంభించడంతో జిల్లా రైతులకు రవాణా కష్టాలు తొలగిపోయాయి. గతంలో గుంటూరు, కర్ణాటక ప్రాంతానికి తీసుకెళ్లి దిగుబడిని విక్రయించాల్సి వచ్చేది. నంద్యాల మార్కెట్‌యార్డు అందుబాటులోకి వచ్చిన తర్వాత స్థానికంగా గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు వెంటనే విక్రయించుకుంటున్నారు.

5 ఎకరాల్లో మిరప సాగు



గత ఏడాది ఎకరా రూ. 50 వేల ప్రకారం ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్ష వరకు వెచ్చించాను. సకాలంలో వర్షాలు లేక ఎకరాకు 20 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఈ ఏడాది ఎకరాకు రూ.44 వేలు కౌలు చెల్లించి ఐదు ఎకరాల్లో మిరప సాగు చేసేందుకు సిద్ధం చేసుకున్నాను. – తిరుపతయ్య, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

ఈ ఏడాది కలిసొస్తుంది



గత ఏడాది మిరప సాగుతో నష్టాలు చవిచూశాం. వర్షాలు కురవక పోవడంతో దిగుబడులు తగ్గాయి. ఈ ఏడాది సీజన్‌కు ముందే వర్షాలు పడటంతో మిరప సాగుకు కలిసొస్తుందని భావిస్తున్నాం. రెండు ఎకరాల్లో మిరప సాగు చేసేందుకు విత్తనాలు, రసాయన ఎరువులు సిద్ధంగా ఉంచుకున్నాను. వర్షాలు సంవృద్ధిగా కురిస్తే వచ్చే నెల మొదటి వారంలో మిరప నాట్లు వేస్తాం. – కుశాయప్ప, అమదాల, కోవెలకుంట్ల మండలం

పీఎం కిసాన్ అర్హతపై ఆరా

- జిల్లాలో 1,96,015 మంది లబ్ధిదారులు
- ముమ్మరంగా సాగుతున్న సర్వే



కానాలలో మహిళా రైతు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

గోస్పాడు: రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం లబ్దిదారుల్లో అనర్హుల ఏరివేతకు సర్వే కొనసాగుతోంది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఏటా రూ.6 వేల చొప్పున అందిస్తోంది. ఈ సాయాన్ని రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అందజేస్తుంది. అయితే ఈ సాయం పొందుతున్న వారిలో ఎవరైనా అనర్హులు ఉంటే గుర్తించేందుకు జాబితా పరిశీలనకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 1,96,015 మంది ఈ పథకం లబ్దిదారులు ఉన్నారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు 2022-23, 2023-24 సంవత్సరాల్లో పీఎం కిసాన్ సాయం పొందిన మొత్తం లబ్దిదారుల్లో ఐదు శాతం మంది రైతుల వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రస్తుతం జిల్లాలో ముమ్మరంగా సాగుతుంది. సర్వేలో భాగంగా 2022-23లో 7535 మంది, 2023-24లో 8556 మంది రైతుల వివరాలతో జాబితాను సిద్ధం చేసి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సర్వే చేస్తున్నారు. వివరాలను ఆరా తీసి ప్రత్యేక యాప్‌లో అప్ లోడ్ చేస్తున్నారు.

పరిశీలిస్తున్న అంశాలివే....

- ☛ పీఎం కిసాన్ పొందే రైతుల్లో ఎవరైనా ఆదాయపన్ను కడుతున్నారా.
- ☛ భూమి లేని రైతులు లబ్ధి పొందుతున్నారా.
- ☛ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఎవరైనా లబ్ధి పొందుతున్నారా.
- ☛ కుటుంబంలో ఇద్దరికి ఈ పథకం వర్తిస్తోందా.
- ☛ ఆధార్ మనుగడలో లేకపోవడం, రాష్ట్రం నుంచి వలస వెళ్లిపోవడం.
- ☛ డూప్లికేట్ రిజిస్ట్రేషన్‌తో పాటు భూమిసాగు చేయకుండా వదిలివేయడం.

ఎంపీడీఓల బదిలీల్లో సందిగ్ధం!

- ఆరు నెలలుగా పక్క జిల్లాల్లోనే విధులు
- సొంత జిల్లాకు వచ్చేందుకు ఎదురు చూపులు
- గత ప్రభుత్వంలో జూలై 5నే బదిలీ ఉత్తర్వులు
- నేడు కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వం
- ఎన్నికలు పూర్తయినా జరగని బదిలీలు



జిల్లా పరిషత్ భవనం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 42 మంది ఎంపీడీఓలను ఈ ఏడాది జనవరి 30వ తేదీన ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఎన్నికల సంఘం ఈ చర్యలు తీసుకుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన అనంతరం ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులను వారి సొంత జిల్లాలకు పంపిస్తుంటారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే నిబంధనల ప్రకారం ఒకే చోట మూడేళ్లు పనిచేస్తున్న వారిని, సొంత జిల్లాల వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ ఏడాది మార్చిలో ఎన్నికల నోటిఫికేస్ రావడం, మే 13న పోలింగ్ నిర్వహణ, జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యింది. జూన్ 8వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం కోడ్‌ను కూడా ఎత్తి వేసింది. అయినా, ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారిని తిరిగి సొంత జిల్లాలకు పంపించడంలో నేటికీ స్పష్టత కొరవడింది.

గత ప్రభుత్వంలో జూలై 5నే బదిలీ ఉత్తర్వులు ...

2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కూడా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు పంపేందుకు అప్పట్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జూలై 5వ తేదీనే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కావొస్తున్నా, నేటికీ తమ బదిలీపై ఎందుకు దృష్టి సారించడం లేదని పలువురు ఎంపీడీఓలు ప్రశ్నిస్తున్నారు.

కుటుంబాలకు దూరంగా ...

గత ఆరు నెలలుగా ఇతర జిల్లాలకు ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వెళ్లిన ఉద్యోగులందరు తమ కుటుంబాలకు దూరంగానే ఉంటున్నారు. తాత్కాలిక బదిలీలు కావడంతో కుటుంబ సభ్యులను తీసుకుని వెళ్లే పరిస్థితులు లేక ఒంటరిగానే కాలం వెళ్లదీస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు 35 మంది, వైఎస్సార్ జిల్లాకు ఏడుగురు బదిలీ అయ్యారు. వీరిలో చాలా మంది బీపీ, షుగర్ ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఒకరిద్దరు గుండె సంబంధిత వ్యాధులతో కూడా బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. వీరి స్థానంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు అనంతపురం జిల్లా నుంచి 23 మంది, వైఎస్సార్ జిల్లా నుంచి 16 మంది ఎంపీడీఓలు వచ్చారు. వీరు కూడా ఇక్కడ పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భార్య, పిల్లలు ఒక చోట, తాము మరో చోట ఉండాల్సి రావడం వల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ ఉద్యోగులతో పాటు రెవెన్యూ అధికారులు కూడా నేటికి ఇతర జిల్లాల్లోనే విధులు నిర్వహిస్తుండడం గమనార్హం.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది



కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీడీఓలు త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. ఈ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. – జీ నాసరరెడ్డి, జెడ్పీ సీఈఓ

నాణ్యమైన విద్య అందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు శ్రద్ధ తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థినులు కచ్చితంగా యూనిఫాం ధరించాలని సూచించారు. టాయిలెట్లు, బాత్ రూములు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్స్‌లోని పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లను ఇతర పరికరాలను కచ్చితంగా తెచ్చుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు పద్మావతిని ఆదేశించారు. అనంతరం వంట గదులను కలెక్టర్ పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విజ్ఞాన వికాసం.. పరిశోధన యోగం

- విద్యార్థి విజ్ఞాన మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- 6 నుంచి 11వ తరగతి విద్యార్థులకు అవకాశం
- ఎంపికైతే స్కాలర్‌షిప్
- ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబర్ 15 తుది గడువు



నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ, విజ్ఞాన ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. నంద్యాల జిల్లా పరిధిలో 1,965 వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉండగా ఈ పాఠశాలల్లో 2.50 లక్షల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతున్న వారికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు భారత దేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్ షిప్, స్కాలర్షిప్ పొందే అవకాశం ఉంటుంది.

దరఖాస్తు విధానం ఇలా..

ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది మే 19న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 15వ తేదీన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలో నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులకు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్, డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒక దాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశముంది. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పరీక్షలు ఉంటాయి. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

జూనియర్, సీనియర్ విభాగాల్లో..

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6-8 తరగతులకు జూనియర్, 9-11 తరగతులకు సీనియర్ గ్రూపుగా ఈ పరీక్ష ఉంటుంది. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషలో పరీక్ష రాయవచ్చు.

వంద మార్కులకు పరీక్ష..

ఈ పరీక్షకు సంబంధించి మాక్ టెస్ట్ అక్టోబర్ 10న నిర్వహిస్తారు, ప్రధాన పరీక్ష అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉంటుంది. అయితే ఇందులో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు (గంటన్నర) పరీక్షను రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు వంతున 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఏలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషి 20 ప్రశ్నలు, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్-బీలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 10 ప్రశ్నలు ఉంటాయి.

రాష్ట్ర స్థాయికి ఇలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6-11 తరగతులకు గాను మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున మొత్తం 18 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3, 10, 17 తేదీల్లో ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2వేలతో పాటు మెమొంటో, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమొంటో, ప్రశంసాపత్రం అందజేస్తారు.

జాతీయ స్థాయికి ఇలా..

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదట ఇద్దరు విద్యార్థుల వంతున 12 మందిని రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదట ముగ్గురు విద్యార్థుల వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, ద్వితీయ, తృతీయ బహుమతిగా వరుసగా రూ.25వేలు. రూ.15వేలు, రూ.10వేలతో పాటు మెమొంటో, ప్రశంసా పత్రం అందజేస్తారు. జాతీయ, జోనల్ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్డీవో, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1- 3 వారాల పాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేందుకు ఇది చక్కటి వేదిక. శాస్త్ర సాంకేతిక రంగాల్లోపై అవగాహన పొందేందుకు మంచి అవకాశం. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యక్తిగత లేదా పాఠశాలల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు www. vvm. orfi వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ



గ్రామంలో పర్యటిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

ఆత్మకూరు: గ్రామీణ ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం వారు బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముష్టపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఓ బాలుడు డెంగీ జ్వరం బారిన పడి ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారులు గ్రామంలో పరిసరాలను పరిశీలించి డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడుతారన్నారు. అనంతరం గ్రామంలో అబేట్ ద్రావణం పిచికారీ చేయించారు. వారి వెంట ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ, కార్యదర్శులు కుద్దూస్, సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డి, సీహెచ్ఓ అహ్మద్‌బాషా ఉన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



కుందూ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

నంద్యాల(అర్బన్): కుందూ పరీవాహక ప్రాంతాల్లోని ఇసుకను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రొక్లెయిన్ల ద్వారా అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుందూ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారులు వస్తున్నారన్న సమాచారంతో కుందూవెంట ప్రొక్లెయిన్లు, ట్రాక్టర్లను తీసుకెళ్లిన అధికార పార్టీకి చెందిన కొంత మంది అక్రమార్కులు అక్కడి నుంచి వాహనాలను తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో నిఘా ఉంచుతామన్నారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మూడు ఇళ్లలో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకే రోజు దొంగలు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానిక జగజ్జననీనగర్ వీధికి చెందిన మాతంగి పుల్లయ్య కుటుంబ సభ్యులకు అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స కోసం గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. చికిత్స పూర్తి చేశాక ఇంటికి తిరిగి వచ్చే లోపే బీరువాలోని 20 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష నగదు దొంగలు దోచుకెళ్లారు. అదే వీధికి చెందిన రామచంద్రన్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం కర్నూలులో ఉన్న బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి హాజరయ్యారు. శుక్రవారం ఇంటికి తిరిగి రాగానే ఇంట్లో ఉన్న రూ. 20 వేల నగదు దొంగలు దోచుకున్నట్లు చెబుతున్నాడు. అలాగే ఫణీంద్రనాథ్ అనే మరో వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఉత్తరప్రదేశ్‌లో అదృశ్యం.. హొళగుందలో ప్రత్యక్షం

- బాలికను ఉత్తరప్రదేశ్ పోలీసులకు అప్పగించిన హొళగుంద పోలీసులు

హొళగుంద: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అదృశ్యమైన బాలిక శుక్రవారం హొళగుందలో ప్రత్యక్షమయ్యింది. హొళగుంద ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాజీనరీ గ్రామంలో మూడు నెలల క్రితం పల్తీఖాన్ కుమార్తె కనిపించకుండా పోయింది. దీంతో తండ్రి పల్తీఖాన్ సమీపంలోని పత్వార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కిడ్నాప్ కేసు నమోదు చేయించారు. తండ్రి పల్తిఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బాలిక వాడుతున్న మొబైల్ ఫోన్ సెల్ టవర్ సిగ్నల్స్ ఆధారంగా బాలిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా హొళగుంద మండలంలో ఉన్నట్లు గుర్తించారు. హొళగుంద పోలీసుల సహకారంతో శుక్రవారం బాలిక ఆచూకీ లభించడంతో తండ్రి పల్తాఖాన్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కలిసి హొళగుందకు వచ్చినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. బాలిక మైనర్ కావడంతో ఇంటి పక్కన ఉన్న తరుణ్‌ఖాన్‌తో మూడు నెలల క్రితం హొళగుందకు వచ్చినట్లు పోలీసుల విచారణలో తెలిసిందన్నారు. బాలికను ఉత్తరప్రదేశ్‌కు తీసుకెళ్లారని హొళగుంద ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వీరి వెంట ఉత్తరప్రదేశ్ పోలీసులు, ఎస్ఐ ములచంద్ర యాదవ్, హెడ్‌కానిస్టేబుల్ సోనీరాణి, కానిస్టేబుల్ నరేంద్రకుమార్ ఉన్నారు.

అద్భుతం.. అపురూపం

- మహానందిలో ఆకట్టుకుంటున్న శిల్పాలు
- ఐదేళ్లపాటు కష్టపడి జీవం పోసిన శిల్పులు



దేవకన్యల శిల్పం



రాణికి పనిమనిషి సహాయం చేస్తున్నట్టుగా..



నవనారీమణులతో ఏనుగు



మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి (కామాక్షిదేవి)





పంచ కల్యాణిలతో గుర్రం, మూషికవాహనం మీద ప్రయాణిస్తున్న వినాయకుడి శిల్పం

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో శిల్పసంపదను చూసిన భక్తులు మంత్రముగ్ధులవుతున్నారు. ప్రతి శిల్పం జీవకళతో ఉట్టిపడుతూ శిల్పుల పనితనానికి అద్దం పడుతోంది. ఏకశిలపై సరస్వతీదేవి, భూదేవి, శ్రీదేవి సహిత విష్ణుమూర్తి శిల్పాలు రూపుదిద్దుకున్నాయి. పంచ పడగలతో నాగబంధం, దశవతారాలు, రాణి అద్దంతో చూసుకుంటూ అలంకరించుకోవడం, దేవలోక నాగకన్యలు, నారీమణులతో ఏనుగు శిల్పం భక్తుల చూపును కట్టిపడేస్తున్నాయి. దేవతా మూర్తులతో పాటు జాతీయ నాయకులైన గాంధీ, నెహ్రూ శిల్పాలను చెక్కి శిల్పులు దైవభక్తితో పాటు దేశభక్తిని చాటుకున్నారు. మహానంది ఆలయ ధర్మకర్తగా 1902 నుంచి 1947 వరకు భైరవజోష్యులు మహానందయ్య పనిచేశారు. ఈయన గుంప్రమానుదిన్నెకు చెందిన బాలవీరాచారితో శిల్పాలను చెక్కించారు. శారదా శిల్పకళా మందిరాన్ని స్థాపించిన బాలవీరాచారి, తన సోదరులు పోతులూరయ్యాచారి, కృష్ణమూర్తి ఆచారి, వీరభద్రాచారితో కలసి 1948లో శిల్పాలు చెక్కడం ప్రారంభించారు. అప్పటి నుంచి ఐదేళ్లపాటు నిరంతరం శ్రమించి శిల్పాలకు జీవం పోశారు. గుంప్రమానుదిన్నె నుంచి ప్రతిరోజూ రావడం కష్టంగా ఉండటంతో మహానంది మండలం సీతారామాపురంలో ఉంటూ సైకిళ్లపై మహానందికి వచ్చి శిల్పాలు చెక్కేరవాని వారి పూర్వీకులు చెప్పారు. అప్పట్లో రోజుకు రూ. 0.75 పైసల వేతనంతో పనిచేశారు. శిల్పులకు రూ. 0.75 పైసలు, మిగిలిన కూలీలకు రూ. 0.25 పైసలు చెల్లించేవారు. ఈ శిల్పాలను అందంగా చెక్కి అపురూపంగా తీర్చిదిద్దడంతో శిల్పుల పనితనం మెచ్చిన మహానందయ్య శిల్పులకు ఎకరా భూమి రూ. 100 చొప్పున 12 ఎకరాలు కొనుగోలు చేసి బహుమతిగా ఇచ్చారని బాలవీరాచారి కుమారుడు రవీంద్రాచారి తెలిపారు. మహానందిలోని శిల్పాలతో పాటు వారు 1965లో శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబిక సింహ స్థంభాల మండపాన్ని నిర్మించారు. వీటితో పాటు 1926లో యాళ్లూరు ఊరువాకిలి, జిల్లెల్ల, గోస్పాడు, కృష్ణనంది పుణ్యక్షేత్రాల్లో శిల్పాలను తయారు చేశారు. ఇటీవల మహానందిలో ప్రతిష్ఠించిన రాహుకేతు మండపంలోని విగ్రహాలను రవీంద్రాచారి కుమారుడు శిల్పి శేఖర్ ఆచారి తయారు చేయడం విశేషం.



అద్భుత శిల్పాలకు నిలయం శ్రీ కామేశ్వరీదేవి ఆలయ మండపం



నాగబంధంలో దేవకన్యల శిల్పం



ఏకశిలా సరస్వతీదేవి విగ్రహం



శివుడు భక్తాటన చేస్తున్నట్లుగా..



శ్రీ భూదేవి, శ్రీదేవి సహిత మహావిష్ణువు ఏకశిలా విగ్రహం



మహాత్మాగాంధీ , నెహ్రూ శిల్పాలు

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): నంద్యాల జిల్లా ముచ్చుమర్రి పరిధిలోని ఎల్లాలకు చెందిన 8 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్‌కుమార్‌రెడ్డి, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజేవతి డిమాండ్ చేశారు. శుక్రవారం ముచ్చుమర్రి సంఘటనను నిరసిస్తూ ఐదు రోడ్ల కూడలిలో ఏఐడీఎస్ఓ, ఏఐఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులపై అత్యాచార ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా ఉండాలంటే అశ్లీల, హింసాత్మక సినిమాలు, మద్యం, డ్రగ్స్, బెట్టింగులను నిషేధించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జహీర్, మల్లేష్, రోజా పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళకు తీవ్రగాయాలు



తీవ్ర గాయాలపాలైన గుర్తు తెలియని మహిళ

తుగ్గలి: ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ తీవ్రగాయాలపాలైన ఘటన శుక్రవారం పగిడిరాయి రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. పగిడిరాయి–రామలింగాపల్లి రైల్వే స్టేషన్ మధ్య ట్రాక్ పక్కన తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న మహిళను పీ.కొత్తూరుకు చెందిన రైతులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది బాధితురాలిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. డోన్ నుంచి గుత్తి వెళ్లే రైలు నుంచి జారిపడి ఉంటుందని భావిస్తున్నారు. బాధితురాలి వివరాలు తెలియాల్సి ఉంది.

కిరాణదుకాణం దగ్ధం

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామంలో గురువారం రాత్రి ఉసేన్‌బాషాకు చెందిన కిరాణ దుకాణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. స్థానికులు గమనించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు.అప్పటికే బియ్యం, బ్యాగ్లు, ఫ్రిజ్, జిరాక్స్ మిషన్ తదితర సామగ్రి కాలి బూడిదయ్యింది. దాదాపు రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

హాస్టళ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంక్షేమ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లలో చేపట్టాల్సిన పనులపై తనకు సమగ్ర నివేదికను వారంలోపు అందించాలన్నారు. వలసలు ఉన్న ఆలూరు, నందవరం ప్రాంతాల్లో హాస్టల్ సీట్లు ఖాళీగా ఉన్నాయని, అలా కాకుండా హేతుబద్ధతతో అడిష్మన్లు తీసుకోవాలన్నారు. పదో తరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో సరైన భవన సముదాయం లేకపోవడంతో నాలుగు బీసీ సంక్షేమ హాస్టళ్లను తాత్కాలికంగా మూసివేశామని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన ప్రతి స్పందిస్తూ.. సంబంధిత హాస్టళ్లను వేరే చోటుకు తరలించాలని, లేదంటే అద్దె భవనాల్లో నిర్వహించాలన్నారు.

కలెక్టర్ సమీక్షించిన అంశాల్లో ముఖ్యమైనవి

- బి.తాండ్రపాడులోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహానికి అప్రోచ్ రోడ్డు
- ట్రైబల్ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న 44 మంది డైలీ వేజ్ వర్కర్లకు వేతనాలు మంజూరు
- మైనార్టీ సంక్షేమ శాఖలో 15 పాయింట్ల ప్రోగ్రామ్ అమలు
- ఆదోని ఐటీఐ కళాశాల, రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభానికి చర్యలు
- కర్నూలులో కామన్ సర్వీసు సెంటర్, ఉర్దూ డిగ్రీ కాలేజ్, బాయ్స్‌హాస్టల్‌కు భూమి కేటాయింపు
- సమీక్షలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రంగలక్ష్మీదేవి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్‌ఖన్నా, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్ పాల్గొన్నారు.

పొలం అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

నందవరం: మాచాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై పొలం అక్రమ రిజిస్ట్రేషన్ విషయంలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. శుక్రవారం ఎస్ఐ, బాధితురాలు నరసమ్మ తెలిపిన వివరాలు.. మాచాపురానికి చెందిన కసిరెడ్డి నరసమ్మకు నందవరం గ్రామంలోని సర్వే నంబర్ 112/ఏ లో 4.12 ఎకరాలు, సర్వే నంబర్ 113ఏలో 1.99 ఎకరాలు మొత్తం 6.11 ఎకరాల పొలం ఉంది.. సదరు పొలాన్ని గతంలో మాచాపురం గ్రామానికి చెందిన సాగర్ విజయరాజు, సుధీర్ కుమార్, జయప్రభు తండ్రులు కౌలుకు తీసుకుని సాగు చేసేవారు. వారిని మరణాంతరం నరసమ్మకు తెలియకుండా సాగర్ విజయరాజు, సుధీర్‌కుమార్, జయప్రభు సదరు పొలాన్ని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉరుకుందలో టెండర్లు వాయిదా

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో వివిధ పనులకు టెండర్లు పిలవగా సరైన స్పందన లేకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్ తెలిపారు. శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా అన్నప్రసాదం పంపిణీ, షామియానాల ఏర్పాటు, మూడు ఇంచుల పేపర్ రోల్ సరఫరా, గోశాల కంపోస్టు, శ్రావణమాసంలో ట్రాక్టర్ల ద్వారా తాగు నీటిని సరఫరా చేసేందుకు ఆన్‌లైన్, సీల్డ్ విధానాల్లో టెండర్లు పిలవగా ఎవరూ ముందుకురాలేదు. అలాగే శ్రావణమాసంలో ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులకు ఒక్కరే టెండరు దాఖలు చేయడంతో వీటిన్నింటినీ రద్దు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మోటార్ ధ్వంసం



సి.బెళగల్‌లో దుండగులు ధ్వంసం చేసిన మోటారు పైపులైను, విద్యుత్ తీగలు

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్త తెలుగు ఈరన్నకు చెందిన వ్యవసాయ మోటార్, పైపు లైను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. తీగను కట్ చేయడంతో మోటారు బావిలో పడిపోయిందని, అదేవిధంగా స్టార్టర్‌ను సైతం ధ్వంసం చేసినట్లు బాధితుడు తెలిపారు. తాను మూడు ఎకరాల పొలంలో పత్తి పంటను సాగు చేసుకున్నానని, ఇప్పుడు పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని, నిందితులను గుర్తించి తనకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, గ్రామంలో విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలం రాంపురం గ్రామ సమీపంలో పంప్ హౌస్ దగ్గర 10 బాక్సుల కర్ణాటక మద్యంతో పాటు ఆటోను పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. మంత్రాలయం మండలం రాంపురానికి చెందిన ముల్లా మహబూబ్, చాపలబాబు, కాచాపురానికి చెందిన బోయ ఈరన్న, బోయ రాఘవేంద్రల నుంచి మొత్తం 270 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ.లక్ష ఉంటుందని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు లింగప్రసాద్, రబ్బానీ, కానిస్టేబుళ్లు భరత్, నరసింహారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

చీకటి పడితే ఒంటరిగా బయటికి రావద్దు

- చిరుతను బంధించేందుకు చర్యలు
- జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



ఈశ్వర్‌నగర్‌లో మహిళలతో మాట్లాడుతున్న జేసీ, డీడీ, ఆర్డీఓ

మహానంది: మహానంది గ్రామంలోని పార్వతీపురం, దేవస్థానం కాలనీ, ఈశ్వర్‌నగర్ కాలనీల్లో నివాసం ఉండేవారు చీకటి పడితే ఒంటరిగా బయటికి రావద్దని, అత్యవసమైతే సమూహంగా వెళ్లాలని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, ఏఈఓలు వై.మధు, ఓంకారం వెంకటేశ్వరుడు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో కలిసి శుక్రవారం రాత్రి మహానందిలో చిరుత సంచరిస్తున్న ప్రాంతాల్లో పర్యటించారు. ఈ మేరకు జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేస్తూ అప్రమత్తంగా ఉండటంతో పాటు ప్రజలకు జాగ్రత్తలు చెబుతూ ఉండాలన్నారు. అటవీశాఖ భూములను ఆనుకుని సరిహద్దుల వెంట గ్రీన్‌మ్యాట్ వెంటనే ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులను కోరారు. చిరుతపులిని బంధించి సుదూర ప్రాంతాలకు తరలించేందుకు ఎన్ఎస్‌టీఆర్, సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, వస్తే సుదూర ప్రాంతాలకు తరలిస్తామన్నారు. అంత వరకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ప్రజలు జాగ్రత్త పడుతూ సహకరించాలన్నారు. చిరుతపులి సంచరిస్తున్న ప్రాంతాల్లో పందులు ఉన్నాయని, వాటిని వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేవని, బయటికి వెళ్లాల్సి వస్తుందని ఈశ్వర్‌నగర్ కాలనీ మహిళలు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. జేసీ వెంట తహసీల్దార్ రామచంద్రుడు, డీటీ శ్రీనివాసులు, సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఎఫ్ఆర్ఓ దినేష్‌కుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ శివనాగజ్యోతి, వీఆర్ఓ శివప్రసాద్, పీఎస్ లక్ష్మీ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.